క్లుప్తంగా

విద్యార్థుల రక్తదానం



నెల్లూరు (టౌన్): జాతీయ ఇంజినీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సోమవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ కొండేటి మాధవి మాట్లాడుతూ ఒకరు అందించిన రక్తంతో మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రావణ్‌కుమార్, బ్లడ్‌బ్యాంక్ నోడల్ అధికారి డాక్టర్ అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

28న వస్త్ర దినోత్సవం

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో ఈనెల 28వ తేదీన కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వస్త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను సుబేదారుపేటలోని అన్నపూర్ణ ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల సందర్భంగా పది మంది చేనేత కార్మికులను, ముగ్గురు వస్త్ర వ్యాపారులను సత్కరించనున్నామన్నారు. అలాగే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నృత్యపోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. పాల్గొనే వారు 89780 59422 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో బి.రఘురామిరెడ్డి, వి.మహేష్, డి.అంకిరెడ్డి పాల్గొన్నారు.

ఈ-పోస్ యంత్రాల పంపిణీ

నెల్లూరు సిటీ: పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఈ-పోస్ యంత్రాలను ఆర్డీఓ అనూష సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సాంకేతిక బృందంతో చర్చించి, కొత్త ఈ-పోస్ యంత్రాల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని సూచించారు.

అమ్మణ్ణి హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ కోవూరు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది మే 5 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు కానుకల రూపంలో రూ.38,06,705 వచ్చాయన్నారు. సాధారణ హుండీల ద్వారా రూ.36,80,471, అన్నదాన హుండీ ద్వారా రూ.1,26,234 సమర్పించారన్నారు. అలాగే 250 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీలో సౌదీ 500 రియాల్ 8, 200 రియాల్ ఒకటి, 100 రియాల్ 13, సింగపూర్ డాలర్లు 10, యూఎస్ఏ డాలరు ఒకటి, కువైట్ దినార్, మలేసియా రింగిట్ ఒక్కటి చొప్పున సమర్పించారన్నారు. పర్యవేక్షకులుగా జిల్లా దేవదాయ శాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బాబు, పూడిపర్తి రామలింగేశ్వరుని దేవస్థానం ఈఓ ఎస్.శ్రీధర్‌నాయుడు వ్యవహరించారు. అర్చకుడు ఎస్.రఘురామమూర్తి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి కఠిన చర్యలు

నెల్లూరు(క్రైమ్): నేరాలను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అజిత వేజెండ్ల దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్యను ఆదేశించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. మూడేళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, యాక్టీవ్ రౌడీషీటర్లు తదితరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, సస్పెక్టులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచాలన్నారు. హత్య, దోపిడీ ఇతర తీవ్రనేరాల కేసుల్లో ఉన్న వారిపై రౌడీషీట్లు తెరవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ/వార్డులను సందర్శించి ప్రజలతో మమేకమై పోలీస్ సేవలను చేరువ చేయాలని చెప్పారు. ఆమె వెంట నగర, ఎస్బీ డీఎస్పీలు పి.సింధుప్రియ, ఎ.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో సంతకాల సేకరణను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షుడు సంజయ్ కుమార్ మాట్లాడుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహించనున్నామన్నారు.

పొదుపు సంఘాలను భాగస్వామ్యం చేయాలి

నెల్లూరురూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధిలో పొదుపు సంఘాలను భాగస్వామ్యం చేయాలని జేసీ కార్తీక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గ్రామ సమృద్ధిపై ఆయన జిల్లాస్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వ రూపొందించిన ఈ-ప్లాన్ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించండి

నెల్లూరు రూరల్: 25వ డివిజన్ బుజబుజనెల్లూరులో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ మిషనరీ దుస్థితికి చేరిందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ స్థానిక సీపీఎం కార్యదర్శి కృష్ణమూర్తి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ఎనిమిదేళ్ల నుంచి ప్లాంట్ శిథిలావస్థలో ఉందని, సుమారు రూ.2 కోట్లతో నిర్మించి 25 వేల మంది జనాభాకు నీటిని అందించే ఈ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.



వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్న 25వ డివిజన్ వాసులు

ఆయన వెంట వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, టి.శ్రీను పాల్గొన్నారు.

బస్ షెల్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోండి

నెల్లూరు రూరల్ మండలంలోని గొల్లకందుకూరు, పాతవెల్లంటి 2, కొత్త వెల్లంటి, కందమూరు, సౌత్ మోపూరు, ములుమూడి, కొమ్మరపూడి, ఆమంచర్ల, మన్నవరపాడు, మొగళ్లపాళెం, మాదరాజుగూడూరు, పెనుబర్తి, జొన్నవాడ మెయిన్ రోడ్డు, మూలాపేట ఇరగాళమ్మ గడి సెంటర్ల వద్ద బస్ షెల్టర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని సీపీఎం రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్ కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం సమర్పించారు. నెల్లూరు రూరల్ మండలంలోని బస్‌షెల్టర్ల మీద ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అదేవిధంగా బస్‌షెల్టర్లు లేని గ్రామాల్లో నూతనంగా నిర్మించాలని కోరారు.

పెన్నా రివిట్‌మెంట్ పనులు కొనసాగించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 54వ డివిజన్ భగత్‌సింగ్‌కాలనీ ముంపునకు గురి కాకుండా గత ప్రభుత్వంలో మంజూరైన పెన్నానది రివిట్‌మెంట్ పనులు తిరిగి ప్రారంభించాలని సీపీఎం నాయకులు ఇరిగేషన్ అధికారి గిరిని కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా ఇరిగేషన్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రూ.100 కోట్లతో చేపట్టిన పెన్నానది రివిట్‌మెంట్ పనులు గత ఆరు నెలల నుంచి నిలిపివేశారన్నారు. వీటి కోసం తవ్విన గుంతల్లో ప్రమాదవశాత్తు పడి ఇప్పటికే ఇద్దరు మహిళలు మృతిచెందారని గుర్తుచేశారు. రానున్న వర్షాకాలంలో నేపథ్యంలో పనులు కొనసాగించి పూర్తి చేయాలని కోరారు. సీపీఎం నాయకులు మూలం ప్రసాద్, జాఫర్, రామకృష్ణ, మస్తాన్, సుబ్బమ్మ, సులోచన, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ప్రాథమిక చికిత్స కిట్ల పంపిణీ

నెల్లూరు (టౌన్): వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డేను పురస్కరించుకుని సోమవారం కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు పాఠశాలలకు ప్రాథమిక చికిత్స కిట్లను సోమవారం అందజేశారు. బుజబుజనెల్లూరులోని ఎస్సీ కాలనీ, న్యూ కాలనీ, గిరిజన కాలనీల్లోని ఎంపీపీ స్కూల్స్, బీజేపీ కాలనీలోని ఎంపీపీ ఉర్దూ స్కూల్స్‌లో వీటిని అందించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహగిరి, టీడీపీ నేత జెన్ని రమణయ్య, జిల్లా పీహెచ్‌పీ



నాయకులు శాఖవరపు వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్ ట్యాక్స్ పేరుతో దండకాలు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జున



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'సోమిరెడ్డి, ఆయన కుమారుడు ఎస్ ట్యాక్స్ పేరిట ఏ కంపెనీని వదలకుండా దండుకుంటున్నారు, రూ.కోట్లు గడిస్తూ సర్వేపల్లిని సోమిరెడ్డి సర్వనాశనం చేస్తున్నాడు' అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లిలో జరుగుతున్న అన్యాయాలు, దుర్మార్గాలను ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేక సోమిరెడ్డి, ఆయన పెయిడ్ ఆర్టిస్టులు అయోమయ పరిస్థితులు సృష్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దుర్మార్గాలు, దౌర్జన్యాలను కాకాణి ప్రజలకు వివరిస్తూ, పోరాటం చేస్తున్నారన్నారు. సోమిరెడ్డి అవినీతి సంపాదనకు కాకాణి అడ్డొస్తున్నారని అక్రమ కేసులు పెట్టి, 86 రోజులు జైలులో ఉంచారని, ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందన్నారు. ఐదు సార్లు ఓడిపోయి, రాజకీయాలు చాలించుకునే సమయంలో గలివాటంగా గెలిచినవాడు సోమిరెడ్డి అని అన్నారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేస్తే, ఖండించని స్వార్థపరుడు సోమిరెడ్డి అని, ఆయన గెలిచిన రోజు నుంచి ప్రజల గురించి ఆలోచన చేయకుండా, అక్రమ సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కనీసం టీ షాపు పెట్టాలన్నా సోమిరెడ్డికి, ఆయన కుమారుడికి ఎస్ ట్యాక్స్ కట్టే పరిస్థితులు ఉన్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినంత మాత్రాన కాకాణిని ప్రజల నుంచి విడదీయలేరన్నారు. సోమిరెడ్డికి నీతి, నిజాయితీ ఉంటే, గ్రావెల్‌పై కాకాణి అడిగిన అనుమతులు చూపించాలన్నారు. అలాగే గ్రావెల్ తవ్వకాలపై సీబీఐ విచారణ వేయించాలన్నారు. కొందరు టీడీపీ నేతలు సోమిరెడ్డి అధికారానికి పావులుగా మారుతున్నారన్నారు. అతని మాటలు విని కాకాణిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. సోమిరెడ్డి అక్రమాలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటం చేస్తామని, ప్రజల ముందు వారిని దోషిగా నిలబెట్టే కార్యక్రమం చేపడుతామన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన విద్యార్థి

నెల్లూరు సిటీ: రూరల్ తహసీల్దార్ కృష్ణప్రసాద్ సమక్షంలో తప్పిపోయిన విద్యార్థి సాయిని సోమవారం తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు నగరంలోని కావేరి నగర్‌కు చెందిన రాము కుమారుడు ఎం.సాయి గూడూరులోని ఎస్సార్కే కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. ఆ సమయంలో స్నేహితుల ద్వారా శ్రీకాళహస్తి వెళ్లి హిజ్రాలతో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గత నెల ఆగస్టు 14న ఇంటి నుంచి వెళ్లి కనిపించలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో విద్యార్థి తండ్రి జిల్లా బాలల సంరక్షణాధికారి బి.సురేష్‌ను సంప్రదించారు. వెంటనే ఆయన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చి మిస్సింగ్ కేసు నమోదు చేయించారు. విచారణలో పోలీసులు గూడూరులో హిజ్రాల వద్ద సాయిని గుర్తించారు. అనంతరం నెల్లూరుకు తరలించి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సాయిని ఆయన తల్లిదండ్రుల సమక్షంలో అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బాలల భద్రత కోసం తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

జాషువా కవిత్వంపై ఉపన్యాసం రేపు

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్తమాన సమాజం హాల్లో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు 'గుర్రం జాషువా కవిత్వం.. మానవీయ దృక్కోణం' అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ వేదిక నిర్వాహకుడు వై.శేషగిరీశం సోమవారం తెలిపారు. వక్తగా తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు అధ్యయనశాఖ నిర్వాహకుడు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వ్యవహరిస్తారన్నారు.

ఆదాలపై నిరాధార ఆరోపణలు దారుణం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మొహిద్దీన్



నెల్లూరు సిటీ: మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిపై టీడీపీ నాయకులు కక్షగట్టి నిరాధార ఆరోపణలు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మొహిద్దీన్ అన్నారు. మాగుంట లేఅవుట్‌లోని నీర్ హోమ్స్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదాల రాజకీయ జీవితంలో ఎలాంటి ఆరోపణలు లేని వ్యక్తిగా ఉన్నారన్నారు. ఆయనపై విషప్రచారం చేసేందుకు కారణాలు లేకపోవడంతో పీఆర్వోగా పనిచేసిన రేవూరి వెంకటస్వామిని టీడీపీ నాయకులు ఆశ్రయించి, ఆయన పేరుతో విషప్రచారం ప్రారంభించారని మండిపడ్డారు. ఆదాల రాజకీయ జీవితంలో రౌడీలను ప్రోత్సహించిన చరిత్ర లేదన్నారు. వాస్తవానికి రేవూరి వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ కార్యకర్త కల్లూరు లక్ష్మీరెడ్డికి టీవీ చానల్ ప్రారంభిస్తామని విడతల వారీగా రూ.39 లక్షలు స్వీకరించి మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ వ్యవహారంలో ఆదాలకు ఎలాంటి సంబంధం లేకపోయినా, నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. పొగతోటలోని ఓ న్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మూడో అంతస్తులో స్టాఫ్‌రూమ్ ఉంది. మూడు రోజులుగా అక్కడ సిబ్బంది లేరు. గీజర్, ఫ్రిజ్ ఆన్‌లో ఉండటంతో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. గదిలో నుంచి దట్టమైన పొగలు కింది అంతస్తులోకి వ్యాపిస్తుండడాన్ని గమనించిన ఆస్పత్రి సిబ్బంది అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఏడీఎఫ్ఓ శ్రీనాథ్‌రెడ్డి, ఎల్ఎం చంద్రశేఖర్‌లు తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. తొలుత కింది ఫ్లోర్‌లో ఉన్న రోగులను పక్కనే ఉన్న మరో హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం పైగదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా దట్టంగా పొగ ఉండటంతో



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్నిమాపక సిబ్బంది పక్క హాస్పిటల్ పెంట్‌హౌస్ నుంచి మూడో అంతస్తు కిటికీలను పగులగొట్టి రెండు ఫైరింజన్లతో నీటిని ఉపయోగించి మంటలను అదుపుచేశారు. అనంతరం తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లిచూడగా గదిలోని వస్తువులు అగ్నికి దగ్ధమయ్యాయి. సుమారు రూ.రెండున్నర నుంచి మూడు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు వెల్లడించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి రోగులను పక్క హాస్పిటల్‌కు తరలించడంతో పెనుప్రమాదం తప్పింది.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నెల్లూరు(బారకాసు): నగరంలోని 14వ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో సోమవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను నగరపాలక హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఓ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని వీధులను పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు అంతర్గత రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కాలువలను శుభ్రం చేస్తూ మురుగునీరు సాఫీగా పారాలని, ఆయా ప్రాంతాల్లో అవసరమైన మేరకు సున్నం, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. అదేవిధంగా ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా సంబంధిత యజమానులకు తెలియజేయాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట కార్పొరేటర్లు కర్తం ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణ, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేక.. ఆస్తులపై కన్ను

- పార్టీ మారకపోవడంతో కక్ష సాధింపులు
- బరితెగిస్తున్న టీడీపీ నేతలు



మాగుంట లేఅవుట్‌లోని గౌరీ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికార అండతో టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కొందరు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులను రాజకీయంగా ఎదుర్కోలేక ఆస్తులను ఆక్రమించడం, అసత్య ప్రచారాలకు బరితెగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ రూరల్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరీ, భర్త సురేష్‌లకు మాగుంట లేఅవుట్‌లోని రవీంద్రనగర్ నాలుగో వీధిలో 67 అంకణాల స్థలం ఉంది. 2022లో రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా మరొకరి నుంచి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఇంటిని నిర్మించుకునేందుకు మున్సిపల్ ప్లాన్ అప్రూవల్ కూడా తీసుకున్నారు. ఆ స్థలంలో పాత ఇంటికి సంబంధించిన విద్యుత్ మీటరు, ఇంటి పన్ను పత్రాలు ఉన్నాయి. ఈ క్రమంలో గతేడాది నవంబర్‌లో ఇంటి నిర్మాణం కోసం శంకుస్థాపన కూడా చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూరల్ నేతలు మొయిళ్ల గౌరీని టీడీపీలోకి రావాలని ఒత్తిడి చేశారు. పలువురితో రాయబారాలు కూడా నడిపారు. అయినప్పటికీ ఆమె వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద అభిమానం, పార్టీపై నమ్మకంతో టీడీపీ నాయకుల ఒత్తిడికి తలొగ్గలేదు. దీంతో ఆ స్థలాన్ని కొందరు టీడీపీకి చెందిన వ్యక్తులు రెండు నెలల కింద ఆక్రమించారు. దీంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. ఎస్పీకి, కలెక్టర్‌కు కూడా పలుమార్లు ఫిర్యాదు చేసింది. ఐదో నగర పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసింది.

గతంలోనూ..

రాజకీయంగా ఎదుర్కోలేని టీడీపీ నేతలు మొయిళ్ల గౌరీ ఆస్తులపై కన్నువేశారు. అందులో భాగంగా ఈ ఏడాది మార్చిలో 23వ డివిజన్‌లో కల్యాణ్ నగర్‌లోని గౌరీకి చెందిన 33 అంకణాల రెండు ప్లాట్లను కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేసి ఆక్రమించారు. స్థలంలోని ఓ గదిని కూడా కూల్చివేశారు. దీంతో కోర్టుకు వెళ్లగా స్టే విధించింది. ఇది జరుగుతున్న నేపథ్యంలో తాజాగా గౌరీపై ఓ వర్గంతో అసత్య ప్రచారాలకు టీడీపీ వర్గం తెరతీసింది. ఈ విషయంపై వైఎస్సార్‌సీపీ నాయకులు మొయిళ్ల గౌరీకి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(బారకాసు): రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ నందన్ స్వీపింగ్ మెషీన్ వాహన నిర్వాహకులకు సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్వీపింగ్ మెషీన్ వాహనాల ద్వారా జరుగుతున్న పనులను కమిషనర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఏకేనగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో పర్యటించారు. చెత్త తరలింపు వాహనం కంపాక్టర్ పనితీరును పరిశీలించారు. వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో వ్యర్థాలను పరిశుభ్రం చేయాలన్నారు. స్నేహ నగర్ రెండో వీధిలో కాంపాక్ట్ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించిన అనంతరం సమీపంలోనే ఇస్కాన్ వంటశాలను తనిఖీ చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని వెహికల్ షెడ్‌ను తనిఖీ చేసి, వాహన మరమ్మతులను పర్యవేక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణకు నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను స్వయంగా నడిపారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, పంప్ స్టేషన్, డాగ్ షెడ్ తదితర ప్రాంగణాల్లో పర్యటించి వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. స్థానిక జయలలిత నగర్ ప్రాంతంలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణపై సూచనలు చేశారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం అందించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఆశా వర్కర్లకు న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కనీస వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటోందని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు. ఏపీ ఆశా వర్కర్స్ జిల్లా ఆరో మహాసభ నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశాలను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి ఇన్సూరెన్స్, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారిన సమయంలో ఆశాలపై అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, వెంటనే అరికట్టాలన్నారు. గతంలో చేసిన ఉద్యమాలు, పోరాటాల వల్ల ఆశా వర్కర్లకు రూ.10 వేలు వేతనం ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, వెంటనే దానిని అమలు చేయాలన్నారు. అనంతరం



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మధుసూదన, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, కోశాధికారిగా మేరీ, ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా వసుందర, వజ్రమ్మ, రాణితో పాటు మరో 14 మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కె.అజయ్‌కుమార్, భువనేశ్వరి, లత, సౌందర్య హాజరయ్యారు.

సురక్షిత తాగునీటిని సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్ఎంసీ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ నగరవ్యాప్తంగా 15 రిమోట్ డిస్పెన్సరీ కేంద్రాల ద్వారా ప్రతిరోజు సుమారు మూడు లక్షల లీటర్ల సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. నగర వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా విభాగాల వారీగా అకౌంట్స్-3, ఇంజినీరింగ్-4, రెవెన్యూ-6, పబ్లిక్ హెల్త్-4, హౌసింగ్-14, టౌన్ ప్లానింగ్-14 చొప్పున మొత్తం 45 విజ్ఞప్తులను అందుకున్నామని కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

కేంద్రం సవరించుకోవాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అనంతపురం ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే సవరించుకోవాలని రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం నెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. మన ప్రజల అభివృద్ధి కోసం ఆ సంస్థ ఎంతో కృషి చేసిందని గుర్తుచేశారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డేను సోమవారం నిర్వహించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఇంజినీర్లు కె.గోపాల్‌రెడ్డి, ఎన్వీ సుబ్బరాజు, సర్వీసులో ఉన్న కె.మురళీకృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్ర రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, డాక్టర్ అంకిరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, నేతలు స్వర్ణ రమేష్‌బాబు, కేఎంకే రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఖలీల్‌బేగ్, ఆరి ప్రసాద్, జయదేవ్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

నెల్లూరు (టౌన్): మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉత్తమ ఇంజినీర్లుగా ఎదగాలని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామారావు తెలిపారు. జాతీయ ఇంజినీర్స్‌డేను పురస్కరించుకుని సోమవారం కళాశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు రామ్‌ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి, భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌లోని ఏడుగురు ఇంజినీర్లను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, నసీర్ అహ్మద్, బెల్లం చెంచయ్యనాయుడు, బిరదవోలు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీర్లకు సత్కారం

ఇరిగేషన్ కార్యాలయంలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని హరనాథపురం జిల్లా జలవనరుల శాఖ కార్యాలయంలో ఇంజినీర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. నీటిపారుదల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరు దేశ్‌నాయక్, సోమశిల ప్రాజెక్ట్ సర్కిల్ ఎస్ఈ రమణారెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్టు సర్కిల్ ఎస్ఈ ఎస్.రాధాకృష్ణారెడ్డి హాజరై, మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఘన నివాళులర్పించారు. అనంతరం పలు క్రీడా పోటీలను నిర్వహించారు. నాలుగు జిల్లాల పరిధిలో జరిగిన ఇరిగేషన్ క్రికెట్ క్లబ్ ట్రోఫీని పెన్నా లయన్స్ టీమ్ కైవసం చేసుకుంది. కార్యక్రమానికి ఏపీఏఈఈ జిల్లా ప్రెసిడెంట్ ఆర్.హరీష్‌కుమార్, పలువురు ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ నెల్లూరు(పొగతోట): భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ విభాగానికి చేసిన సేవలు ప్రపంచ ప్రఖ్యాతి చెందాయని పంచాయతీరాజ్ ఎస్ఈ కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఇంజినీర్స్‌డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య తిరుమల-తిరుపతి ఘాట్ రోడ్డు, కృష్ణరాజసాగర్ డ్యామ్, మూసీనదిపై రిజర్వాయర్ నిర్మాణం, మైసూరు బృందావనం గార్డెన్స్, బిహార్‌లో గంగానదిపై రైలు వంతెన వంటి అద్భుత కట్టడాలను చేపట్టారన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ పంచాయతీ రాజ్ ఇంజినీర్ల సంఘం, పీఆర్ ఇంజినీర్ల సంఘం నాయకులు ఎం.బాబురావు, ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో..



జిల్లా జలవనరుల శాఖ కార్యాలయంలో..



ఆర్కిటెక్ట్, ఎల్టీపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

➡ జిల్లా సివిల్ ఇంజినీర్స్, ఆర్కిటెక్ట్, ఎల్టీపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డేను మినర్వా గ్రాండ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సతీష్‌బాబు, జుబేరుద్దీన్, గోపినాథ్ పాల్గొన్నారు.